సాక్షి
జోగులాంబ గద్వాల
సోమవారం । 5 । ఫిబ్రవరి । 2024



బీజేపీ అడ్డా.. పాలమూరు

పాలమూరు పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి గెలుపొందుతారని బండి సంజయ్ తెలిపారు.

వివరాలు 8లో ▸



పాలకమండలికి నోటిఫికేషన్

దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల పాలకమండళ్ల ఏర్పాటుకు ప్రకటన వచ్చింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
36.1/23.3

వాతావరణం

ఆకాశం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి, ఉదయం, రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

క్యాన్సర్ మహమ్మారిని తరిమేద్దాం



గద్వాల క్రైం: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని పాలియేటివ్ కేర్ విభాగంలో రోగుల సమక్షంలో కేక్ కట్టింగ్ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి రాజు మాట్లాడారు. క్యాన్సర్ మహమ్మారి భారిన పడి చాలా మంది రోగులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. తీసుకునే ఆహార అలవాట్లు విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మద్యం, పొగాకు, గుట్కా, సిగరెటు, మత్తు పదార్థాలు తీసుకోవడం ద్వారా వచ్చే వ్యాధులు క్యాన్సర్‌తో పాటు శరీరంలోని అవయవాలు దెబ్బతింటాయన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు ఏర్పచుకోవాలన్నారు. వైద్యులు చెప్పే స్వీయ జాగ్రత్తలు మన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయన్నా రు. శ్యాంసుందర్, రూతు, నీలమ్మ ఉన్నారు.

ప్రజల జీవనోపాధిపై అనాగరిక దాడులు

నాగర్‌కర్నూల్ రూరల్: దేశం కోసం శ్రమిస్తున్న కార్మిక రైతుల జీవితాలు, జీవనోపాధిపై మోదీ ప్రభుత్వం నిరంతరాయంగా అనాగరిక దాడులను చేస్తుందని ఏఐటీయూసీ తెలంగాణ ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే పారిశ్రామిక సమ్మె గ్రామీణబంధును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ సంఘాల రైతు వ్యవసాయ కార్మిక ఐక్య కార్యాచరణ కమిటీ సదస్సును ఉద్దేశించి మాట్లాడారు. రాజ్యాంగంలోని హక్కులను దుర్వినియోగం చేస్తూ.. రాజ్యాంగ సంస్కరణలను నిర్వీర్యం చేస్తూ ప్రజల హక్కులను కాలరాస్తుందని, ప్రశ్నించే గొంతుకులను నొక్కుతున్నారని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమం కోసం పోరాడి తెచ్చుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం నిరంకుశంగా రద్దు చేసి కార్మిక చట్టాలను 4 కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 16న నిర్వహించ తలపెట్టిన పారిశ్రామిక సమ్మె గ్రామీణ బంద్‌కు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు మాట్లాడారు. కార్పొరేట్ అనుకూల నల్ల కార్మిక చట్టాలు తీసుకొచ్చిన మోదీ ప్రభుత్వం, కార్మికుల హక్కుల భద్రతను కాలరాస్తుందన్నారు. అన్నదాతల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, బాలస్వామి, యాదగిరి, శివ, బాలపీరు పాల్గొన్నారు.



ప్రత్యేక నిధులపై సందిగ్ధం

జిల్లాకు మంజూరుకాని రూ.152.30 కోట్లు

- గతేడాది జిల్లా పర్యటనలో నాటి సీఎం కేసీఆర్ ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు
- 4 మున్సిపాలిటీలకు రూ.125 కోట్లు
- 255 గ్రామపంచాయతీలకు రూ.25కోట్లు
- ప్రభుత్వ మార్పుతో నిధుల విడుదలపై వీడని సందిగ్ధం



ఉండవెల్లిలో డ్రెయినేజీ లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

అలంపూర్:

జిల్లాలోని మున్సిపాలిటీలు.. మండల కేంద్రాలు.. గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాకు రూ.152.30కోట్లు కేటాయించింది. ప్రత్యేక అభివృద్ధికి నిధుల కేటాయింపు చేస్తూ పాలన అనమతులు సైతం వచ్చాయి. ప్రధానంగా రోడ్లు, డ్రెయినేజీలతోపాటు మున్సిపాలిటీల్లో సుందరీకరణ పనులకు ఈ నిధులు వెచ్చించవచ్చని.. దీంతో రూపురేఖలు మారతాయని అంతా ఆశపడ్డారు. కానీ, రాష్ట్రంలో ప్రభుత్వం మార్పుతో నిధులపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం ప్రభుత్వాలు మారడంతోపాటు గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిపోయింది. గత ప్రభుత్వం వెచ్చించిన నిధుల కోసం ప్రజా ప్రతినిధులు వేచి చూసిన సకాలంలో ప్రభుత్వం నుంచి రాలేదు. ప్రత్యేక నిధుల కోసం నిరీక్షించిన సర్పంచ్‌లు వాటిని వినియోగించకుండానే దిగిపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం మున్సిపాలిటీల పదవీ కాలం సమీపిస్తుండటంతో కనీసం ఈ ప్రభుత్వమైన నిధులు వెచ్చిస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

నిధులు రాకుండానే.. ముగిసిన సర్పంచ్‌ల పదవీకాలం

గత ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ ఆ నిధులు రాకపోవడంతో వాటిని వినియోగించకుండానే సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిపోయింది. గ్రామ పంచాయతీలకు గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా నిధులు రాలేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రగతి, రైతు సంఘం భవనాలు, నర్సరీ వనాలు, క్రీడా ప్రాంగణాలు, శ్మశాన వాటిలు వంటి పనులు చేపట్టింది. వీటితోపాటు సీడీఎఫ్ ద్వార, పంచాయతీ ద్వార వచ్చిన నిధులతో అడపా దడపాగా పనులు జరుగుతున్నాయి. భారీగా నిధులు వెచ్చించి పనులు చేపట్టడానికి గ్రామ సర్పంచ్‌లకు అవకాశం దక్కలేదు. దీంతో అనేక గ్రామాల సర్పంచ్‌లు నిధుల విషయంలో నిరాశలో కాలం వెల్లదీశారు. అప్పటి సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనలో ప్రత్యేకంగా నిధులు కేటాయించడంతో గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు ఊరట కలిగిసుందని సర్పంచ్‌లు భావించారు. ఒక్కో పంచాయతీకి రూ. 10 లక్షలు, ఒక్కో మండల కేంద్రానికి రూ. 15 లక్షలు కేటాయించడంతో సర్పంచ్‌లు గ్రామాల్లో కొంతైనా అభివృద్ధి చేసే అవకాశం దక్కుతుందని సంబరపడ్డారు. సకాలంలో నిధులు వచ్చి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన వాటిలో కొన్నింటిని పూర్తి చేసుకొనే అవకాశం దక్కుతుందని భావించారు. కానీ ఇవేవి దక్కకుండానే నిధులు రావడంలో జాప్యం జరగడంతో నిరాశతోనే పదవికి దూరం కావాల్సి వచ్చింది. మున్సిపాలిటీల పదవి ముగిసే కాలం సైతం సమీపిస్తుంది. కొత్త ప్రభుత్వం గతంలో పాలన అనుమతులు ఇచ్చిన నిధులను కేటాయింపు చేస్తుందా లేదా అనే దానిపై సందిగ్ధం నెలకొంది. ఇప్పటికే కేటాయించిన నిధులతో పనుల ప్రణాళికలు సిద్ధంగా ఉన్నప్పటికి నిధులు రాకపోవడంతో ఎదురు చూపులతోనే కాలం వెల్లదీస్తున్నారు.

నిరాశే మిగిలింది



సర్పంచ్‌లుగా ఎన్నికైన నాటి నుంచి అనేక ఒడిదుడుకులను ఎదుర్కోవాల్సి వచ్చింది. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి సంకల్పించాం. కానీ చాలీచాలని నిధులతో సమస్యలు పరిష్కరించే అవకాశం పూర్తిస్థాయిలో దక్కలేదు. గత ప్రభుత్వం పంచాయతీకి రూ.10 లక్షలు కేటాయించడంతో చివరి సంవత్సరం కొన్ని పనులు చేయడానికి అవకాశం దక్కిందని సంతోషించాం. కానీ నిధులు రాక నిరాశతోనే పదవి ముగిసిపోయింది.

– శివరాములు, మాజీ సర్పంచ్, బస్వాపురం

ముందస్తు పనులు చేశాం



అప్పటి సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనలో మండల కేంద్రాలకు ప్రత్యేక అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారు. దీంతో ముందస్తుగా మండల కేంద్రంలో పను లు గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభు త్వం నుంచి నిధులకు పాలన అనుమతి జీఓ రావడంతో పనులు చేశాం. ప్రస్తుతం ఆ పనులకు సంబంధించిన బిల్లులు రావాల్సి ఉంది.

– రేణుక, మాజీ సర్పంచ్, ఉండవెల్లి

ప్రతిపాదనలు చేశాం



గత ప్రభుత్వం మున్సిపాలిటీలకు నిధులకు కేటాయించి పాలన అనుమతులు ఇచ్చింది. వాటికి అనుగుణంగా మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన ప్రతిపాదనలు అడగటంతో సిద్ధం చేశాం. ఆ తర్వాత ఎన్నికల కోడ్ వచ్చింది. దీంతో ప్రతిపాదనలు చేసిన పనులు సకాలంలో ప్రారంభించడానికి అవకాశం కలగలేదు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల మేరకు పనులు చేపడతాం.

– గోల్కొండ నర్సయ్య, మున్సిపల్ కమిషనర్, అలంపూర్

జిల్లాకు రూ.152.30 కోట్లు

గతేడాదిలో జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి కింద రూ. 152.30 కోట్లు మంజూరయ్యాయి. 2023 జూన్ 12వ తేదిన గత సీఎం కేసీఆర్ జిల్లాకు విచ్చేశారు. అదే నెల 29వ తేదిన జిల్లాకు ప్రత్యేక నిధులను మంజూరు చేస్తూ జీఓ నెంబర్ 354 విడుదల చేశారు. జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీలకు, మండల కేంద్రాలకు, గ్రామ పంచాయతీలకు అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. గద్వాల మున్సిపాలిటీకి రూ.50 కోట్లు, అయిజకి రూ. 25కోట్లు, వడ్డేపల్లికి రూ. 25 కోట్లు, అలంపూర్‌కి రూ. 25 కోట్లు మంజూరు చేస్తూ పాలన అనుమతులు ఇచ్చారు. అలాగే, 12 మండల కేంద్రాలకు ఒక్కోదానికి రూ.15 లక్షల చొప్పున మొత్తం రూ. 1.80 కోట్లు, మొత్తం 255 గ్రామ పంచాయతీలకు రూ. 25.50 కోట్లు కేటాయించారు.



అయిజ మండలం యాపదిన్నెలో సీసీ రోడ్డు, డ్రైనేజీ లేని కాలనీ

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి

గద్వాల రూరల్: జిల్లా వ్యాప్తంగా గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు, కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమాభివృద్ధి పథకాలను ప్రతిపల్లెకు తీసుకెళ్లేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిఒక్క పోలింగ్ బూత్‌లలో కార్యకర్తలు, నాయకులు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా చూడాలన్నారు. అదేవిధంగా బూత్‌లలో ప్రముఖులను నియమించారా లేదా అన్న అంశాలను పరిశీలించి పార్టీ బలోపేతమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నదే గావ్ చలో అభియాన్ ఉద్దేశమన్నారు. జిల్లాలోని 700గ్రామాల్లో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపోలింగ్ బూత్‌లలో 31మందితో కమిటీ వేయాలన్నారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరిస్తూనే ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపోలింగ్ బూత్‌లో బీజేపీ 51శాతం పైగా ఓటింగ్ వచ్చేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శివారెడ్డి, రవికుమార్, రామాంజనేయులు, దాసు, లత్తిపురం రామిరెడ్డి, అనిల్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్ కంది రూ.9,221

కల్వకుర్తి రూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు రైతులు భారీగా వేరుశనగను విక్రయానికి తీసుకొచ్చారు. 4,025 క్వింటాళ్ల వేరుశనగను రైతులు అమ్మకానికి తెచ్చారు. అత్యధికంగా రూ.7,326 మధ్యస్థంగా రూ.6,470, అతి తక్కువగా రూ.4,261 ధర లభించాయి. అచ్చంపేట మార్కెట్‌కు ఆదివారం వేరుశనగ పోటెత్తింది. 27,019 బస్తాలను రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు.

కృష్ణా జలాల నిర్వహణ హక్కులు వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ధరూరు: కృష్ణా జలాల నిర్వహణ కేంద్రానికి అప్పగించడంపై తాము పోరాటం చేస్తామని, స్వరాష్ట్రంలో సొంత హక్కుల కోసం ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటామని బీఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడె డీఆర్ విజయ్ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కృష్ణానది యాజమాన్య బోర్డుకు రాష్ట్రంలోని ప్రాజెక్టులను అప్పగించం అన్యాయమన్నారు. కృష్ణా జలాల పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్ వైఖరి ఏమిటో ఇట్టే తెలిసిపోతోందన్నారు. కృష్ణా నదిపై ఉన్న జూరాల, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులకు నీటి గండం వచ్చే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. సాగునీటి మాటేమిటో గాని ఈ నడిగడ్డ ప్రాంతంలో తాగునీటికి కష్టాలు తప్పేలా కనిపించడం లేదన్నారు. 60 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ రాష్ట్రానికి ఒరగబెట్టిందేమి లేదని అన్నారు. 10ఏళ్ల ప్రణాళికా బద్ధమైన విధానాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఏది ఏమైనా స్వరాష్ట్ర ప్రయోజనాలను, రైతలను దృష్టిలో ఉంచుకుని కేఆర్‌ఎంబీ బోర్డుకు మీరిస్తున్నటువంటి సంపూర్ణ హక్కులను వెనక్కి తీసుకోకపోతే మరో పోరాటానికి సిద్ధమవుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సర్వారెడ్డి, రాములు, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవ్ స్మార్ట్, సత్యన్న పాల్గొన్నారు.

అభయాంజనేయుడికి గజవాహన సేవ



స్వామివారికి గజవాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేటలో వెలసిన అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి గజవాహన సేవ నిర్వహించారు. అలాగే ఉదయం పంచ సూక్తములతో పూజలు, సహస్రనామార్చన, ప్రదోశ పూజలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మరికొందరు గజవాహనసేవలో పాల్గొని తరించారు. కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రేమ, రమేష్‌నాయక్, గోపాల్, దత్తాత్రేయశర్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వరం 'ఖేలో ఇండియా'

జిల్లాస్థాయిలో విస్తరణకు స్పోర్ట్స్ అథారిటీ సన్నాహాలు

- ఉమ్మడి జిల్లాకు మూడు కేంద్రాలు మంజూరు
- పాలమూరు, గద్వాలకు ఫుట్‌బాల్.. నాగర్‌కర్నూల్‌కు కబడ్డీ సెంటర్
- ఔత్సాహిక క్రీడాకారులకు అందనున్న మెరుగైన శిక్షణ
- నాలుగేళ్ల నిరీక్షణకు దక్కిన ఫలితం



మహబూబ్‌నగర్‌లో ఫుట్‌బాల్ ఆడుతున్న బాలికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభగల క్రీడాకారులున్నా.. సరైన ప్రోత్సాహం లేక జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగలేకపోతున్నారు. ఈ క్రమంలో జిల్లాల్లో ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటుతో నైపుణ్యం గల క్రీడాకారులకు సువర్ణ అవకాశం లభించనుంది. ఖేలో ఇండియా పథకం క్రీడలకు వరంలా మారుతోంది. క్షేత్రస్థాయిలో క్రీడాకారులకు మెరుగైన క్రీడా శిక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారిస్తుంది. ఇందులో భాగంగా ఖేలో ఇండియా పథకాన్ని క్షేత్రస్థాయిలో విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తుంది. ఎట్టకేలకు జిల్లాస్థాయిలో ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటుతో నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడినట్లయింది.

ఉమ్మడి జిల్లాకు..

కేంద్ర ప్రభుత్వంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాకు మూడు ఖేలో ఇండియా సెంటర్లు మంజూరయ్యాయి. ఈ సెంటర్లలో కోచ్‌లు, కేంద్రాల ఏర్పాటు, రాష్ట్ర, జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. తెలంగాణ రాష్ట్రానికి 13 సెంటర్లు మంజూరు కాగా వాటిలో మూడు ఉమ్మడి జిల్లాకే కేటాయించారు. మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాలకు ఖేలో ఇండియా ఫుట్‌బాల్, నాగర్‌కర్నూల్ జిల్లాకు కబడ్డీ సెంటర్ మంజూరైంది. మహబూబ్‌నగర్‌లోని డీఎస్‌ఏ మైదానం, గద్వాలలోని డీఎస్‌ఏ క్రీడా మైదానంలో ఖేలో ఇండియా ఫుట్‌బాల్ సెంటర్లు, నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ పీజీ, డిగ్రీ కళాశాల మైదానంలో కబడ్డీ కేంద్రం ఏర్పాటు కానుంది.

మెరుగైన శిక్షణ

సాయ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఏర్పాటు కానున్న ఖేలో ఇండియా సెంటర్లతో ఔత్సాహిక క్రీడాకారులకు మెరుగైన క్రీడా శిక్షణ లభించనుంది. ఒక్కో సెంటర్‌లో 30 మంది బాల, బాలికలకు తగ్గకుండా ఆయా క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆయా ఖేలో ఇండియా కేంద్రాల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేసి బాల, బాలికలకు అత్యున్నత స్థాయిలో క్రీడా శిక్షణ లభించనుంది. ఒక్కో కేంద్రానికి రూ.5 లక్షల నిధులతోపాటు క్రీడా సామగ్రి, కోచ్‌కు వేతనం అందించనున్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా ఈ ఖేలో ఇండియా సెంటర్లు వేదికగా ఉపయోగపడనున్నాయి. మరో నెలరోజుల్లో ఖేలో ఇండియా సెంటర్లు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాకు మూడు ఖేలో ఇండియా ఏర్పాట్లు కానుండటంతో సీనియర్ క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది..



ఉమ్మడి జిల్లాకు మూడు ఖేలో ఇండియా సెంటర్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది. ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటుతో ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ సెంటర్లలో క్రీడాకారులకు అత్యున్నస్థాయిలో క్రీడా శిక్షణ లభిస్తుంది. భవిష్యత్‌లో మరిన్ని ఖేలో ఇండియా సెంటర్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తాం.

– శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

సద్వినియోగం చేసుకోవాలి



ఉమ్మడి జిల్లాలో రెండు ఖేలో ఇండియా ఫుట్‌బాల్ సెంటర్లు ఏర్పాటు కావడం ఆనందంగా ఉంది. ఈ సెంటర్లలో క్రీడాకారులకు శాస్త్రీయ పద్ధతిలో మెరుగైన శిక్షణ లభిస్తుంది. ఎప్పటికప్పుడు క్రీడాకారుల ప్రతిభను బేరీజు వేసుకుంటారు. దీంతో క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దవచ్చు. ఈ సెంటర్లను ఔత్సాహిక ఫుట్‌బాల్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

– భానుకిరణ్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్

ఏసీబీకి చిక్కిన మహమ్మదాబాద్ ఎస్‌ఐ

- రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- ఎస్‌ఐతోపాటు కానిస్టేబుల్, మూడో వ్యక్తిపై కేసు నమోదు



ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు



ఎస్‌ఐ సురేష్

మహమ్మదాబాద్/ గండేడ్: ఓ ప్రేమ వ్యవహారం కేసు విషయంలో రూ.50 వేలు డిమాండ్ చేసి రూ.20 వేలు మూడో వ్యక్తి ద్వారా తీసుకుంటూ ఎస్‌ఐ పట్టుబడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలంలోని పగిడ్యాల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన ఓ అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడిపించాడు. అమ్మాయిని వివాహం చేసుకుంటానని నమ్మించి చివరికి మోసం చేశాడు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు శ్రీనివాస్‌రెడ్డిపై జనవరి 17న మహమ్మదాబాద్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయంలో పలు సెక్షన్లు తగ్గించేందుకు శ్రీనివాస్‌రెడ్డి ఎస్‌ఐ సురేష్‌తో రూ.50 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అదేరోజు రూ.30 వేలు ఇవ్వగా శ్రీనివాస్‌రెడ్డి జైలుకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డితో ఎస్‌ఐ ఫోన్‌లో మాట్లాడి మిగతా రూ.20 వేలు ఇవ్వాలని లేకపోతే మీపై కూడా కేసు నమోదు చేస్తానని హెచ్చరించాడు. దీంతో కృష్ణారెడ్డి మహబూబ్‌నగర్‌లోని ఏసీబీ అధికారులను సంప్రదించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రూ.20 వేలు ఎస్‌ఐకి ఇవ్వబోయాడు. దీంతో ఆయన కానిస్టేబుల్ ఇస్మాయిల్‌కు ఇవ్వాలని సూచించారు. కృష్ణారెడ్డి కానిస్టేబుల్ దగ్గరికి వెళ్లి డబ్బులు ఇవ్వబోగా ఆయన కూడా పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న మూస అనే వ్యక్తి జిరాక్స్ సెంటర్‌లో ఇవ్వాలని చెప్పారు. దీంతో కృష్ణారెడ్డి అక్కడ డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకొని ఎస్‌ఐ, మూస అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. కానిస్టేబుల్ ఇస్మాయిల్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

కనిపించని మార్పు..

ఏసీబీ అధికారులు ఒకవైపు లంచం తీసుకుంటూ పట్టుబడిన వారిని జైలుకు పంపిస్తున్నా.. ఉద్యోగుల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఇప్పటికీ చాలాచోట్ల పైసల్ ఇవ్వనిదే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి కనిపిస్తోంది. ఒకవైపు ప్రభుత్వం అవినీతి కంపును వదిలించేందుకు ప్రయత్నాలు చేస్తుండగా.. మరోవైపు అధికారులు మాత్రం అమ్యామ్యాలకు పాల్పడుతూనే ఉన్నారు. వాస్తవానికి పట్టుబడుతున్న వారు కొందరుండగా.. పట్టుబడకుండా పనుల్ని చక్కబెట్టుకునే వారే అధికంగా ఉంటున్నారనేది ప్రజల నోట వినిపిస్తున్న మాట. ఇక్కడ.. అక్కడ అని లేకుండా దాదాపుగా అన్ని శాఖల్లోనూ అవినీతి తాండవిస్తోంది.

నెల వ్యవధిలో నలుగురు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో నెల రోజుల వ్యవధిలో ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడటం కలకలం రేపుతోంది. ఈ ఏడాది జనవరిలో మొదటి కేసు కల్వకుర్తిలో రెవెన్యూ శాఖలో కాగా.. కొన్ని రోజుల వ్యవధిలోనే రెండో కేసు జడ్చర్ల ఎక్సైజ్ సీఐ, ఇటీవల అయిజలోని విద్యుత్ ఉద్యోగి పట్టుబడ్డారు. తాజాగా ఆదివారం మహమ్మదాబాద్ ఎస్‌ఐతోపాటు కానిస్టేబుల్, మరో ప్రైవేట్ వ్యక్తిపై కేసు నమోదు కావడం జరిగింది. ప్రస్తుతం పట్టుబడిన ఉద్యోగులను పరిశీలిస్తే అవినీతి అధికంగా జరుగుతుందని భావించే రెవెన్యూ, విద్యుత్, పోలీస్, ఎక్సైజ్ శాఖలే కావడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో గతంలో ఎప్పుడూ నెల రోజుల వ్యవధిలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను ఏసీబీ అధికారులు పట్టుకున్న దాఖలాలు లేవు. అయితే ప్రతి శాఖలో ఇదే తంతు ఉన్నా.. కొందరు అధికారులు చిక్కకుండా జారుకుంటున్నారు. పోలీస్ శాఖలో అయితే కొందరు అధికారులు, సిబ్బంది ప్రైవేట్ వ్యక్తులను ఏర్పాటు చేసుకుని పనులు చక్కబెడుతున్నారన్న ఆరోపణలకు తాజా సంఘటన బలం చేకూరుస్తోంది.

క్లుప్తంగా

భార్యపై కోపంతో కూతురిని చంపిన తండ్రి

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం: భార్యపై కోపంతో కూతురిని చంపిన తండ్రిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బిజినేపల్లి మండలం రామ్‌రెడ్డిపల్లితండాకు చెందిన తిరుపతినాయక్‌కు హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన శివలీలతో రెండేళ్ల క్రితం వివాహమైంది. భార్యపై అనుమానంతో ఆమెను వేధిస్తుండడంతో ఆమె మూడు నెలల క్రితం మియాపూర్‌లోని తల్లి ఇంటికి 14నెలల చిన్నారిని తీసుకుని వెళ్లిపోయింది. శనివారం తిరుపతినాయక్ తన భార్య వద్దకు వెళ్లి స్వగ్రామానికి తిరిగి రావాలని కోరడంతో ఆమె నిరాకరించింది. దీంతో అతడు తన కూతురుని స్వగ్రామం తీసుకు వెళ్తున్నానని ఆటోలో తీసుకువచ్చి హైదరాబాద్ శివారులో మద్యం తాగి కూతురుని గొంతునులిమి హత్య చేశాడు. ఇదే క్రమంలో ఆదివారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో బిజినేపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన కూతురుని హత్యచేసినట్లు చెప్పి పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి నింది తుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బైకు పైనుంచి పడి ఆర్‌ఎంపీ దుర్మరణం


మృతిచెందిన సంజీవులు(ఫైల్)

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన చాకలి సంజీవులు(40) ఆర్‌ఎంపీ గ్రామ సమీపంలో బైక్ పైనుంచి అదుపు తప్పి భీమా కాల్వలో పడి మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన మృతుడు చిన్నంబావి మండలంలోని పెద్దదగడలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. ఆదివారం కావడంతో గ్రామ సమీపంలోని రంగయ్యమైసమ్మ దేవతను కుటుంబికులు చేశారు. కార్యక్రమానికి ఆయన బైక్‌పై వచ్చాడు. అదుపు తప్పి పడిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య నిర్మల, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నీటిగుంతలో పడి బాలిక మృతి


విష్ణుప్రియ (ఫైల్)

కేటీదొడ్డి: నీటిగుంతలో పడి ఓ బాలిక మృతిచెందిన ఘటన మండలంలోని చింతలకుంటలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కుర్వ రాజుకు ఇద్దరు కుమార్తెలు విష్ణుప్రియ (5), మధుప్రియ. ఆదివారం సెలవు రోజుకావడంతో ఇద్దరు పిల్లలు తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లారు. తల్లిదండ్రులు ఇతర కూలీలతో కలిసి వేరుశనగ పంట తొలగించే పనిలో నిమగ్నమవగా.. ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు పొలంలో ఉన్న నీటిగుంతలో పడిపోయారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే ఇద్దరిని రాయచూర్ ఆస్పత్రికి తరలించారు. విష్ణుప్రియ అప్పటికే మృతిచెందగా.. మధుప్రియ ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి..


శాతర్ల బాల్‌రాం (ఫైల్)

కొత్తకోట రూరల్: చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి కాలుజారి చెరువులో పడి మృతిచెందిన ఘటన మండలంలోని అమడబాకులలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన శాతర్ల బాల్‌రాం (55) శనివారం గ్రామ సమీపంలో ఉన్న సూరోనికుంటకు చేపల వేటకు వెళ్లాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు గ్రామంలో వెదికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం ఉదయం అటుగా పొలాలకు వెళ్లిన రైతులకు చెరువులో మృతదేహం కనబడటంతో గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మృతదేహాన్ని బయటకు తీసి ఇంటికి తరలించారు. బాల్‌రాంకు భార్య వెంకటమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

మహమ్మదాబాద్: అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని సల్కర్‌పేట్ రెవెన్యూ శివారులో ఆదివారం ఉదయం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించింది. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు పోలీసులు తెలియజేశారు.

కేసు నమోదు

బాలానగర్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తారుపాజీ తెలిపారు. మండలంలోని మోదీఘనపూర్ సమీపంలో హీర్యానాయక్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సమాచారంతో అతన్ని అరెస్టు చేసి ఇంట్లో 14 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్టలు తవ్వేస్తున్నారు


ధన్వాడ శివారులో గుట్టలో మట్టిని తవ్వుతున్న పొక్లెయిన్

- యథేచ్ఛగా మట్టి దందా
- కరిగిపోతున్న ఎర్రమన్ను గుట్టలు
- పట్టించుకోని అధికారులు
- చెట్లను నరికేసి.. మట్టి తరలిస్తున్నా కన్నెత్తి చూడని వైనం


మణిపూర్‌తండా వద్ద ఖాళీ అయిన ఎర్రమన్ను గుట్ట

ధన్వాడ: నారాయణపేట జిల్లా ధన్వాడ మండలంలోని ఎర్రమన్ను గుట్టలు ఖాళీ అవుతున్నాయి. అక్రమార్కుల దెబ్బకు కరిగిపోతున్నాయి. గుట్టలను యథేచ్ఛగా తవ్వేస్తూ.. మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో మట్టి అక్రమ దందా మూడు ట్రాక్టర్లు.. ఆరు టిప్పర్లు అన్న చందంగా సాగుతోంది. ఓవైపు ప్రభుత్వం అటవీశాతం పెంచాలని గుట్టలపై మొక్కల పెంపకం చేపడుతుండగా.. మట్టి తరలింపు కోసం అక్రమార్కులు చెట్లను నరికేసి, అడవుల్లాంటి గుట్టలను నాశనం చేస్తున్నారు. రామకిష్టాయిపల్లి మణిపూర్‌తండా శివారులోని గుట్టలో కొన్ని రోజులుగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. రోడ్డువైపు తవ్వకాలు నిర్వహిస్తే అందరికీ కనిపిస్తుందన్న ఉద్దేశంతో వెనుకభాగం నుంచి మట్టి తరలింపు సాగిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి ట్రాక్టర్లు, టిప్పర్లలో నిత్యం మట్టి తరలింపు కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతుల పేరుతో అక్రమ దందా..

జిల్లాలోని ధన్వాడ, మరికల్, మక్తల్, నారాయణపేట తదితర మండలాల్లో ఎర్రమట్టి ఎవరికి అవసరం ఉన్నా ఇక్కడి నుంచే రవాణా అవుతోంది. మట్టిని తరలించేందుకు ట్రాక్టర్‌కు రూ.150 చొప్పున, టిప్పర్‌కు రూ.750 చొప్పున ప్రభుత్వానికి డీడీ చెల్లించి, తహసీల్దార్ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. అధికారులు చూపించిన స్థలం నుంచి మట్టిని తరలించాలి. అయితే మండలంలో మట్టిని తరలించేందుకు ఒకటి, రెండు టిప్పర్లకు అనుమతులు తీసుకొని.. అక్రమ దందా సాగిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా గుట్టల నుంచి మట్టిని తరలిస్తూ, అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా మట్టి దందా సాగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

గుట్టలు కబ్జా..

ధన్వాడ, ఎమ్మోనోనిపల్లి, మంత్రోనిపల్లి, మందిపల్లి గ్రామాల సమీపంలోని ఎర్రమన్ను గుట్టలు కబ్జాకు గురవుతున్నాయి. మట్టి తవ్వకాల జోరుతో గుట్టలు సగభాగం వరకు ఖాళీ అయ్యాయి. దీంతో గుట్టల పక్కనున్న పొలాల వారు ఆక్రమణకు పాల్పడుతున్నారు. స్థలం అలాగే ఉంటే అటవీశాఖ స్వాధీనం చేసుకుంటుందన్న ఉద్దేశంతో కొందరు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. గుట్టలు ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

గుట్టల తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. నర్సరీల కోసం కిష్టాపూర్‌లో అనుమతి ఇచ్చాం. గుట్టలపై తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అనుమతులు ఉంటేనే మట్టిని తరలించాలి.

– సింధూజ, తహసీల్దార్, ధన్వాడ

ధన్వాడ శివారులో ఇలా..

ధన్వాడకు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న భారతగట్టు నుంచి కొంతకాలంగా ఎర్రమట్టి తరలింపు కొనసాగుతోంది. గుట్ట వద్ద తమ స్థలం ఉందని కొందరు ఇటుక బట్టీలను ఏర్పాటు చేసుకుని, ఎర్రమట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. అక్కడ ఫారెస్ట్ ఏరియాగా సూచిస్తూ బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, అక్రమార్కులు లెక్క చేయడం లేదు. గుట్ట నుంచి ఎర్రమట్టి తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. గుట్టపై ఉండే చెట్లను సైతం నరికి వేస్తున్నారు. ఇదిలా ఉండగా.. గుట్టను భూమికి సమాంతరంగా తవ్వి, తమ పొలంలోకి కలిపేసుకుంటున్నారని తెలుస్తోంది. ఇంత జరుగుతున్నా అటువైపు అటవీశాఖ అధికారులు కన్నెత్తి చూడటంలేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పాలమూరు బీజేపీ అడ్డా


మాట్లాడుతున్న బండి సంజయ్ చిత్రంలో డీకే అరుణ, జితేందర్‌రెడ్డి తదితరులు

- ఈసారి ఎంపీ ఎన్నికల్లో గెలుపు ఖాయం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

పాలమూరు: కృష్ణాజలాల వాటా పంపిణీ విషయంలో బీఆర్‌ఎస్ బండారం బయటపెట్టడంతోపాటు ఆనాటి సీఎం కేసీఆర్ మోసాలను ఆధారాలతో సహా బయటపెట్టింది బీజేపీ పార్టీనే అని, అప్పట్లో ఈ సమస్యపై కాంగ్రెస్ అసలు స్పందించలేదని అపెక్స్ సమావేశం జరగడడంలోనూ బీజేపీ పాత్ర చాలా కీలకమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణాజలాల్లో తెలంగాణ వాటా కింద 570 టీఎంసీల నీళ్లు రావాల్సి ఉండగా చంద్రబాబునాయుడు దగ్గర కేవలం 299 టీఎంసీలకే ఒప్పందం చేసుకుని కేసీఆర్ సంతకాలు చేశారని ఆరోపించారు. పాలమూరులో పాదయాత్ర చేసిన సమయంలో జిల్లా పరిస్థితులు తెలుసుకున్నానని, ఇంకా వలసలు ఆగలేదని, ఇంటర్ విద్యార్థి ముంబాయి బస్సులో వలస వెళ్లడం యాత్రలో చూశానని గుర్తుచేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ క్యాడర్ మొత్తాన్ని కాంగ్రెస్ పార్టీ చేర్చుకుంటుందని, కానీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు సైతం ఎంపీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందాలని కోరుకుంటున్నారని వివరించారు. బీఆర్‌ఎస్‌లో ఉండి కబ్జాలు, అవినీతికి పాల్పడిన నాయకులు మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌పై ఉన్న వ్యతిరేకతతో కాంగ్రెస్‌కు ఓట్లు వేశారు తప్ప.. కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో క్యాడర్ పెంచుకొని గెలుపొందలేదని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పాలమూరు బీజేపీ అడ్డా అని, ఏ సర్వే చూసినా మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం బీజేపీకి అనుకూలంగా ఇస్తోందన్నారు. మహబూబ్‌నగర్‌లో ప్రజల సమస్యలపై బీజేపీ ఎన్నో పోరాటాలు చేసిందని, కార్యకర్తలు లాఠీదెబ్బలు తినడంతోపాటు జైలుకు కూడా వెళ్లారన్నారు. ప్రజా సమస్యలపై ఏనాడు కాంగ్రెస్ పోరాటం చేసింది లేదని విమర్శించారు. సమావేశంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బంగారు శృతి, రామచంద్రరావు, ఎగ్గని నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బీడు భూములకు సాగునీరు ఇవ్వాలి


మాట్లాడుతున్న రాఘవాచారి

- పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి

పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 నియోజకవర్గాల్లోని బీడు భూములకు సాగునీరు ఇవ్వడానికి జిల్లా ఇంజినీర్లతో ఒక కమిటీ ఏర్పాటు చేసి, సమగ్ర సాగునీటి ప్రణాళిక రూపొందించాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం, కేసీఆర్ వైఫల్యంతో జిల్లాకు అన్యాయం జరిగిందన్నారు. 'కృష్ణా నది నీళ్లు –ఉమ్మడి పాలమూరు జిల్లా భవిష్యత్' అనే అంశంపై ఆదివారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కేంద్రంలోని టీఎస్‌జీఓ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు సీపీఐ నేత పరమేశ్వర్, సీపీఎం నేత కిల్లెగోపాల్ మాట్లాడారు. చారిత్రకంగా పాలమూరు జిల్లాకు అన్యాయం జరిగిందని, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సీఎంగా పాలమూరు వాసి రేవంత్‌రెడ్డి ఉన్న సమయంలో సాగునీటి న్యాయం సాధించాలన్నారు. కృష్ణా నది నీటి వాటా సాధించడంతో పాటు ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లోని ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.వెయ్యి కోట్ల ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోని 90 టీఎంసీల నీటిలో సగం నీటిని కనీసం 45 టీఎంసీల నీటిని జూరాల లోపల భీమా-కృష్ణా సంగమం నుంచి తీసుకోవాలన్నారు. త్వరలో నారాయణపేట, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాలకులు, ప్రభుత్వాలు ఎన్నికల చదరంగం కోసం రైతుల జీవితాలతో చలగాటం ఆడుతున్నారన్నారు. ఒక హక్కుగా సాగునీరు సాధించుకోవడంతో పాటు జిల్లా భూములను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు చంద్రశేఖర్, హనీఫ్ అహ్మద్, ఖలీల్, లక్ష్మయ్య, వీరన్న, సుదర్శన్, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు


గుప్తనిధుల కోసం తవ్విన గుంత

కోడేరు: మండల కేంద్రం శివారులో లక్ష్మాపూర్ ఆంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. కోడేరు మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో దాదాపు 150 ఏళ్ల కిందట లక్ష్మాపూర్‌లో 50 ఇళ్లు ఉండేవి. అప్పట్లో ఎత్తం గట్టు నీడ గ్రామంపై పడుతుండటంతో కీడు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారని మూఢనమ్మకంతో గ్రామాన్ని వదిలేశారు. దీంతో ఇళ్లు శిథిలావస్థకు చేరి చెట్లు మొలిచాయి. ఆలయాలు, విగ్రహాలు పూర్వికులు ఉపయోగించిన వస్తువులు ఆనవాళ్లు మాత్రమే దర్శనం ఇస్తున్నాయి. ఆంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన కొంత భూమి ఉంది. ఇళ్లు శిథిలావస్థకు చేరాయి. దీంతో అక్కడ గుప్తనిధులు ఉన్నట్లు కొందరు దుండగలు వారం రోజుల కిందట పరిసర ప్రాంతంలో పొక్లెయిన్‌తో తవ్వకాలు చేపట్టారు. రెండు చోట్ల తవ్వకాలు చేసిన ఆనవాళ్లు ఉన్నాయి. తవ్వకాలు జరిపిన ప్రదేశంలో నిమ్మకాయలు, కుంకుమ, పసుపు వేసి పెద్ద రాయిపై మంత్రాలు చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హన్వాడ: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిపోర్టర్ తిర్పయ్యను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అంతకుముందు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షబ్బీర్ సోదరుడు ఆబెద్‌హుస్సేన్ అనారోగ్యంతో మృతి చెందగా, ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎంపీ, మాజీ మంత్రి పరామర్శలు..

తిర్పతయ్యను ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

బాలికపై వేధింపులు: విచారణ చేస్తున్న అధికారులు

అమ్రాబాద్: బాలికను ఓ వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని అమ్రాబాద్ మండలంలోని ఓ గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. 50 సంవత్సరాలు ఉన్న ఓ వ్యక్తి అదే గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని అనాథ బాలికను లైంగికంగా వేధిస్తున్నాడు. విషయం బయటకు రాకుండా ఆ వ్యక్తి గ్రామపెద్దలతో సర్దుబాటు చేసుకునే ప్రయత్నాలు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయం 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు సమాచారం వెళ్లింది. ఆదివారం చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం, పోలీసులు ఆ గ్రామాన్ని సందర్శించి బాలికను తీసుకెళ్లారు. ఈ సంఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

లైంగికదాడి కేసులో రిమాండ్

జడ్చర్ల: బాలికపై శనివారం ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిని అరెస్ట్ చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఓ కాలనీకి చెందిన బాలికపై గౌరీశంకర్‌కాలనీకి చెందిన యాదగిరి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసిన అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బస్సు, బైక్ ఢీ.. బాలుడికి తీవ్ర గాయాలు


సంఘటన స్థలంలో ఆర్టీసీ బస్సు, బైక్


గాయపడిన బాలుడు

కోస్గి: ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఓ బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం సలీంపూర్‌కు చెందిన విద్యార్థి భీమేష్ కోస్గి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఇంటర్ గురుకుల అడ్మిషన్ పరీక్ష రాయడానికి ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి బయలుదేరాడు. ఈ క్రమంలో కోస్గి–మహబూబ్‌నగర్ రోడ్డులో వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బాలుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో పాలమూరు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘనపై బాలుడి తల్లి బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలియజేశారు.

మద్యం మత్తులో తల్లిపై దాడి

- అనంతరం కత్తితో గొంతుకోసుకున్న కుమారుడు

జడ్చర్ల: తాగిన మత్తులో కన్నతల్లిపై కర్రతో దాడి చేసిన అనంతరం తాను కూడా కత్తితో గొంతు కోసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్లిన సంఘటన ఆదివారం జడ్చర్లలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ఇంద్రమ్మ, కుమారుడు నవీన్ నివాసం ఉంటున్నారు. మద్యానికి బానిసగా మారిన నవీన్.. తాగిన మైకంలో తల్లితో గొడవపడ్డాడు. గొడవలో కర్రతో తల్లి తలపై మోదడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లిని కర్రతో బాధిన తరువాత ఆందోళనకు గురైన కుమారుడు కత్తితో గొంతు కోసుకున్నాడు. గొంతు నుంచి రక్తం వస్తున్నా.. ఇంటి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నడుచుకుంటూ వెళ్లాడు. రక్తం మరకలతో వచ్చిన క్షతగాత్రుడిని గమనించిన పోలీసులు, వెంటనే వైద్య చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, పరిస్థితిని బట్టి చర్యలు చేపడుతామని సీఐ ఆదిరెడ్డి తెలియజేశారు.

యాసంగి పంటలకు సస్యరక్షణ


సాగు చేసిన జొన్న పంట

పాడి-పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్


మిరపలో ఎండు తెగులు

- మిరపలో కొమ్మ ఎండు, లద్దె పురుగు
- జొన్నలో కాండం తొలుచు పురుగు నివారణ

అలంపూర్: యాసంగిలో సాగు చేసిన పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పంటను కాపాడుకోవడంతోపాటు అధిక దిగుబడి సాధించడానికి అవకాశం ఉంటుందని ఏడీఏ సక్రియ నాయక్ తెలిపారు. రైతులు మిరప పంట అధికంగా సాగు చేశారు. ప్రస్తుతం ఉన్న వాతావరణంతో తేమ శాతంలో మార్పులు కన్పిస్తున్నాయి. ఈ కారణంగా మిరప పంటలో కొమ్మ ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. ఆల్టర్‌నేరియా శిలీంద్రం వలన ఈ కొమ్మ ఎండు తెగులు ఆశిస్తుందని వివరించారు. ఈ తెగులు కారణంగా ముదురు కొమ్మల బెరడుపై గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయని సూచించారు. ఈ తర్వాత కొమ్మలు ఎండుతూ కిందికి వస్తాయి. ఈ తెగులు తీవ్రమైనప్పుడు కొమ్మలు ఎండిపోయి కిందికి వాలిపోతాయి. దీని వలన దాదాపు 50 శాతం వరకు పంట నష్టం కలిగే అవకాశం ఉంటుంది.

నివారణ

ఈ తెగులు గుర్తించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలి. గుర్తించిన వెంటనే ప్రోపికొనజోల్ ఒక మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి లేదా డైఫెన్‌కొనజోల్ 0.5 మి.లీ. లీటర్ నీటిలో కలిపి లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.

లద్దెపురుగు లేదా కాయతొలుచు పురుగు

మిరపపంట చిరుకాయ దశలో ఉంది. అక్కడక్కడ కాయ తొలుచు పురుగు ఆశించడమైనది. ఈ పురుగు కాయలోకి ప్రవేశించి కాయలోపలి పదార్థాన్ని తినడం వలన కాయ నాణ్యత పడిపోతుంది. కాయపై చిన్న రంధ్రాలు చేసి ఈ పురుగు లోపలికి ప్రవేశిస్తుంది.

నివారణ

ఈ పురుగు నివారణకు వేప నూనె 5 మి.లీ. లేదా అసిఫేట్ 1.5 గ్రాములు, నువలురాన్ ఒక మి.లీ. లేదా ఫ్లుబెండమయిడ్ 0.3 మి.లీ. లేదా క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ.ను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

పోషకాల పిచికారి

వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఎకరానికి 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులు వేసుకోవాలి. పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు 19:19:19 పోషకం 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

జొన్న పంటలో..

జొన్న సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ తెలిపారు. జిల్లాలో సాగు చేసిన జొన్న పంటకు కాండం తొలుచు పురుగు ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. కాండం తొలుచు పురుగు ఆకుల కొనల ద్వారా అంకురం వరకు ప్రవేశించి దీని వేయడం వలన మొక్క చనిపోతుంది. యాసంగి సీజన్‌లో ఈ పంట ఉధృతి అధికంగా ఉంటుందని రైతులకు సూచించారు. ఈ పురుగు నివారణకు కార్బోసల్ఫాన్ గుళికలను ఎకరానికి 5 కిలోలు మొక్క సుడులలో వేయాలని సూచించారు. పురుగు ఉధృతి మరింత ఎక్కువగా ఉన్న సమయాల్లో క్లోరాంత్రినిపోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

- కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టెక్‌టవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835.
- Sri Avani Eco-Life Pvt Ltd. తక్కువ పెట్టుబడితో వ్యాపారాన్ని ప్రారంభించండి. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా * బయో డిగ్రేడబుల్* కవర్లను మార్కెటింగ్ చేయుటకు మండలాల వారీగా డీలర్లు కావలెను. ఫోన్: 9493786468, 6301041696.

DOCUMENT MISSING

- తిరుమలమ్మ అలియాస్ కవటి తిరుమలమ్మ D/o తిరుమలయ్య వయస్సు48 సం॥లు R/o H.No. 1-32 రాంచంద్రపురం గ్రామం, మహబూబ్‌నగర్ రూరల్ మండలం, మ.నగర్ జిల్లా-509001 అనే నా యొక్క ప్లాట్ డాక్యుమెంట్ నం.35/1997, 24-01-2024 నాడు రాంచంద్రపురం నుండి మహబూబ్‌నగర్‌కు ఆటోలో పెట్టుకుండగా నా యొక్క ప్లాట్ ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది.కావున ఎవరికైన దొరికినచో ఈ క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. ✆ 6302912649.

WANTED

- Raymands Cloth Show Room వనపర్తిలో పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇంఛార్జ్, సేల్స్ ఇంఛార్జ్ కావలెను. సెల్ : 9492801999.
- నర్మద హోండా షోరూం వనపర్తిలో పని చేయుటకు సర్వీస్ మేనేజర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్, సర్వీస్ ఇంచార్జ్ కావలెను. సెల్ : 9440435080.
- ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని, వంట పని చేయుటకు, వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ. 20k ఫోన్: 8977689662/8977689663.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ఖచ్చితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్

క్లుప్తంగా...

నేటి నుంచి ఏపీ అసెంబ్లీ, మండలి సమావేశాలు

7న ఓటాన్ అకౌంట్ బడ్జెట్

సాక్షి, అమరావతి: ఏపీ శాసనసభ, శాసన మండలి సమావేశాలు సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉభయ సభల సభ్యు లను ఉద్దేశించి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రసంగంతో ఈ సమావేశాలు ప్రారంభమవుతాయి. అనంతరం శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ సమావేశమై ఈ సమావేశాలు ఎప్పటి వరకు నిర్వహించాలనేది నిర్ణయించనుంది. అదేవిధంగా త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. అంతకుముందు ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించడానికి ఏడో తేదీ ఉదయం 8గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశం జరగనుంది.

నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమమేలేదు

- టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

సాక్షి, హైదరాబాద్: నక్సల్ ఉద్యమం లేకుంటే తెలంగాణ ఉద్యమమేలేదని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. తెలంగాణ సమాజంలో ఉన్న అసమానతల కారణంగానే యువత తిరుగుబాటు బావుటా ఎగురవేసిందని పేర్కొన్నారు. మంగళారపు లక్ష్మణ్ రాసిన 'మాయని గాయాల నెత్తుటి చరిత్ర(యథార్థ సంఘటనల సమాహారం) పుస్తక పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం ఇక్కడి రవీంద్రభారతి మినీహాలులో నిర్వహించారు. చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను నక్సల్స్ ఉద్యమమే విముక్తిబాట పట్టించిందనే నిజాన్ని సమాజానికి చెప్పాలని సూచించారు. ఆకలి ఉన్న వారితోపాటు ఆకలిబాధ తెలిసిన ఎంతోమంది నక్సల్ ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. చరిత్రలో జరిగిన విధ్వంసాన్ని, ఉద్యమాలను ప్రజలకు తెలిపేందుకు ప్రత్యేక పుస్తకాలు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి కార్పొరేషన్ తొలి చైర్మన్ వీరమల్లు ప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యమస్ఫూర్తిని చంపేశారని, మళ్లీ అది రావాలన్నారు. ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకున్న ఎంతోమంది తెలుగునాట జరిగిన నక్సల్ బరి ఉద్యమంలో ప్రాణాలు త్యాగం చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్, రచయిత జకీర్, పుస్తక రచయిత మంగళారపు లక్ష్మణ్, రచయిత డాక్టర్‌తైదల పాల్గొన్నారు.

తప్పు.. మీదంటే మీదే

- విద్యాశాఖలో ఇద్దరు అధికారుల మధ్య వాగ్వాదం !
- డిప్యుటేషన్లపై ఆరా తీసిన సీఎంఓ
- సమగ్ర నివేదిక కోరిన రాష్ట్ర ప్రభుత్వం .. డిప్యుటేషన్లపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు



సాక్షి, హైదరాబాద్: విద్యాశాఖలో డిప్యుటేషన్ల వ్యవహారం చిచ్చురేపుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి కార్యాలయం రంగంలోకి దిగింది. సమగ్ర వివరాలు అందించాలంటూ ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇదే సమయంలో ఇష్టానుసారంగా డిప్యుటేషన్లు ఇస్తున్నారంటూ ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా మండిపడుతున్నాయి. సీఎంకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు సంఘాల నేతలు ఈ వ్యవహారంపై సీఎం కార్యాలయానికి ఫిర్యాదులు పంపారు. సాధారణ బదిలీలు చేపట్టకుండా, అయినవారు, ముడుపులు ఇచ్చి న వారిని కోరుకున్న ప్రాంతానికి పంపుతున్నారని సంఘ నేతలు ఆరోపిస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో టీచర్లు సిటీకి.. చదువులు గాలికి'అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ వార్తపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, అంతర్గత విచారణకు ఆదేశించినట్టు తెలిసింది.

కొత్త వివాదానికి దారి తీస్తున్న డిప్యుటేషన్లు

టీచర్ల డిప్యుటేషన్ అంశం అధికారుల మధ్య కొత్త వివాదానికి దారి తీస్తోంది. విద్యాశాఖలో ఉన్నతాధికారులు కొంతమంది ఈ తంతుతో తమకు సంబంధమే లేదని చెబుతున్నారు. తాను వ్యతిరేకించినా డిప్యుటేషన్ ఆర్డర్ ఎలా వచ్చిందో తెలియదని ఓ అధికారిణి తెలిపారు. కీలకమైన బాధ్యతల్లో ఉన్నా, ప్రేక్షక పాత్ర పోషించాల్సి వస్తోందని ఆమె నిస్సహాయత వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే, విద్యాశాఖ ఉన్నతాధికారి మాత్రం ఈ వాదనతో ఏకీభవించడం లేదు. ఫైల్ సంబంధిత అధికారిణి ద్వారానే తనకు వస్తుందని, ఆమెకు తెలియకుండా ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. మానవతకోణంలో బదిలీలు చేస్తున్న విషయాన్ని ఆమె ఎందుకు పక్కదారి పట్టిస్తున్నారో తెలియడం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇద్దరి మధ్య వాగ్వాదం కూడా జరిగినట్టు విద్యాశాఖ వర్గాల సమాచారం. పరస్పరం సీఎంఓకు ఫిర్యాదులు చేసుకుంటున్న వైనం విద్యాశాఖలో చర్చనీయాంశమైంది.

రంగంలోకి మధ్యవర్తులు

తీవ్ర విమర్శలు వస్తున్నా డిప్యుటేషన్ వ్యవహారం ఆగడం లేదు. ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు గత నెల 11వ తేదీన ఓ టీచర్‌ను డిప్యుటేషన్ ఇస్తూ ఇచ్చిన ఉత్తర్వులు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఇవే కాకుండా మరికొన్ని డిప్యుటేషన్లు ఇవ్వడానికి రంగం సిద్ధమైందని ఉపాధ్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది. డిప్యుటేషన్ల బేరసారాలు పలు జిల్లాల్లో జోరుగా సాగుతున్నాయని టీచర్లు అంటున్నారు. అనారోగ్య సర్టిఫికెట్లు సృష్టించి మరీ డిప్యుటేషన్లు ఇప్పిస్తామని నమ్మబలుకుతున్నారని వారు చెబుతున్నారు. కొంతమంది రాజకీయ పలుకుబడిని ముందుకు తెస్తుంటే, మరికొంతమంది తమకు విద్యాశాఖలో ఉన్నతాధికారి తెలుసునని, ఆయనకు కొంత ముట్టజెబితే డిప్యుటేషన్ సులభమని నమ్మిస్తున్నారని పలువురు టీచర్లు తెలిపారు.

ప్రభుత్వం విశ్వసనీయత నిలుపుకోవాలి

ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత పాటించి విశ్వసనీయతను కాపాడుకోవాలి. పలుకుబడి కలిగిన ఉపాధ్యాయులకు డిప్యుటేషన్ పేరిట జిల్లాలు దాటించి బదిలీలు చేయటం సమంజసం కాదు. అనారోగ్యం, భార్యభర్తలు తదితర సహేతుక కారణాలతో బదిలీలు చేయాలనుకుంటే ఒక విధానపరమైన నిర్ణయం తీసుకుని అవసరమైన, అర్హులైన ఉపాధ్యాయులకు అవకాశం ఇవ్వటం సమంజసం. ఉపాధ్యాయులు బదిలీలకోసం అడ్డదారులు తొక్కే పరిస్థితి కల్పించారు. నూతనంగా ఏర్పాటైన ప్రజా ప్రభుత్వంలో అటువంటి పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నాం.

– చావా రవి,
టీఎస్ యూటీఎఫ్ ప్రధానకార్యదర్శి

2,002ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్క్

నక్కపల్లి వద్ద రూ.1,235 కోట్లతో ఏర్పాటు



సాక్షి, అమరావతి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద 2,001.8 ఎకరాల్లో బల్క్‌డ్రగ్ పార్క్ రూపుదిద్దుకోనుంది. ఈ బల్క్‌డ్రగ్ పార్కును ఈపీసీ విధానంలో నిర్మించడానికి ఏపీఐఐసీ టెండర్లు పిలిచింది. రూ.1,234.75 కోట్లతో బల్క్‌డ్రగ్ పార్కును డిజైన్ చేసి అభివృద్ధి చేసే విధంగా ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించింది. 2001.8 ఎకరాల్లో.. 139.07 ఎకరాల్లో ఉన్న చెరువులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. అభివృద్ధి చేసిన పార్కులో 1,009.85 ఎకరాల్లో ఫార్మా పరిశ్రమలు, 595.4 ఎకరాల్లో ఏపీఐ-డీఐఎస్ సింథసిస్, 414.1 ఎకరాల్లో ఫెర్మిటేషన్స్, 150 ఎకరాలు ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగించే విధంగా ఈ పార్కును అభివృద్ధి చేయనున్నారు. మార్చి 18 నాటికి బిడ్డింగ్ ప్రక్రియ పూర్తిచేసి పనులు అప్పగించనున్నారు. చైనా నుంచి ఫార్మా దిగుమతులను తగ్గించుకోవాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మూడు బల్క్‌డ్రగ్ పార్కులను ఏర్పాటు చేయడానికి ముందుకొస్తే.. 16 రాష్ట్రాలతో పోటీ పడి ఆంధ్రప్రదేశ్ ఈ పార్కును కైవసం చేసుకున్న విషయం విదితమే. తొలుత కాకినాడ వద్ద నిర్మించడానికి ప్రయత్నం చేయగా పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేయాలన్న నిబంధన మేరకు నక్కపల్లి వద్ద పార్కును అభివృద్ధి చేస్తున్నారు.

ఫార్మాహబ్‌గా ఏపీ: ఈ బల్క్‌డ్రగ్ పార్కుతో రాష్ట్రం ఫార్మాహబ్‌గా ఎదగనుంది. ఇప్పటికే రాష్ట్రంలో 300కు పైగా ఫార్మా కంపెనీలున్నాయి. ఈ బల్క్‌డ్రగ్ పార్కు అందుబాటులోకి వస్తే 100కు పైగా ఫార్మా కంపెనీలు కొత్తగా ఏర్పాటవుతాయని అంచనా వేస్తున్నారు. వీటిద్వారా 27,360 మందికి ప్రత్యక్షంగా ఉపాధికి లభిస్తుందని అంచనా. ప్రస్తుతం దేశీయ ఫార్మా ఉత్పత్తుల్లో రాష్ట్రం 16 శాతం వాటాతో మూడోస్థానంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో రూ.41,500 కోట్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు వస్తుండగా.. అందులో రూ.8,300 కోట్లకు పైగా ఎగుమతులు జరుగుతున్నాయని అంచనా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2,400 ఎకరాల్లో అభివృద్ధి చేసిన జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో ఇప్పటికే మైలాన్, ఫైజర్, డాక్టర్ రెడ్డీస్, అరబిందో వంటి 60కి పైగా దిగ్గజసంస్థలు ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఈ బల్క్‌డ్రగ్ పార్కు అందుబాటులోకి వస్తే అంతర్జాతీయ కంపెనీలు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రజా రవాణాను కాపాడుకోవాలి

తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

మన్సూరాబాద్: ప్రజా రవాణాను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) రాష్ట్ర మహాసభ ఎల్‌బీనగర్ హిమగిరి గార్డెన్స్‌లో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యూనియన్లు లేకుంటే కార్మిక వ్యవస్థ లేదని, కార్మికుల కష్టనష్టాల్లో యూనియన్ల పాత్ర కీలకమన్నారు. ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్లు లేకపోతే కట్టు బానిసలం అవుతామని స్పష్టంచేశారు. ఆర్టీసీ ఆస్తులను ఆక్రమించుకునేందుకే గత ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి పూర్వ వైభవం వచ్చిందని, కార్మికులకు రావాల్సిన బాకాయిలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. ఆర్టీసీ టీఎంయూ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అశ్వత్థామరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్ కమిటీని రద్దు చేసి యూనియన్ పునరుద్ధరచేయాలనేది ప్రధాన డిమాండ్ అన్నారు.



హాజరైన ఆర్టీసీ కార్మికులు

స్థానిక సంస్థల్లో 50 శాతానికి రిజర్వేషన్లు పెంచాలి

మంత్రి కోమటిరెడ్డికి ఆర్.కృష్ణయ్య వినతి



కాచిగూడ (హైదరాబాద్): స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 22 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని జా తీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులతో కలిసి కృష్ణయ్య మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ...గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతంకు తగ్గించారన్నారు. కులగణనకు వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రీమిలేయర్ తొలగించాలని కోరారు. బీసీల్లో ప్రతి కులానికి ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సీబీఐ విచారణలో కాకాణికి క్లీన్‌చిట్

- నెల్లూరు న్యాయస్థానంలో చోరీతో ఆయనకు సంబంధం లేదు
- చార్జ్‌షీట్ దాఖలు చేసిన సీబీఐ

సాక్షి, అమరావతి: నెల్లూరు న్యాయస్థానంలో ఫైళ్ల గల్లంతైన కేసులో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చింది. ఫైళ్ల గల్లంతు వ్యవహారంతో కాకాణికి ఏమాత్రం సంబంధం లేదని, ఈ కేసులో ఏపీ పోలీసులు సక్రమంగానే దర్యాప్తు చేశారని తేల్చిచెప్పింది. రాష్ట్ర పోలీసులు దర్యాప్తు జరిపి నిందితులుగా పేర్కొన్న సయ్యద్ హయత్, షేక్ ఖాజా అనే ఇద్దరు వ్యక్తులే నెల్లూరు న్యాయస్థానంలో ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలతోపాటు ఫైళ్లను కూడా అపహరించినట్లు నిర్ధారించింది. మంత్రి కాకాణి ఆ ఫైళ్లను దొంగతనం చేయించారన్న టీడీపీ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేసింది. ఈమేరకు విజయవాడలోని ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జ్–మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో సీబీఐ దాఖలు చేసిన చార్జ్‌షీట్ తాజాగా వెలుగులోకి వచ్చింది. నెల్లూరులోని నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 2022 ఏప్రిల్ 13 రాత్రి కొందరు ఆగంతకులు దొంగతనానికి పాల్పడి ఎలక్ట్రానిక్ ఉపకరణాలతోపాటు పలు పత్రాలను అపహరించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దొంగతనానికి పాల్పడ్డ సయ్యద్ హయత్, షేక్ ఖాజాలను అరెస్ట్ చేసి వారి నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు పంపారు. ఈ ఉదంతంపై టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వ్యతిరేకంగా న్యాయస్థానంలో దాఖలైన కేసులో ఆధారాలను గల్లంతు చేసేందుకు చోరీకి పురిగొల్పారని అభాండాలు వేశారు. ఈ ఆరోపణలను తిప్పికొట్టిన మంత్రి కాకాణి దీనిపై సీబీఐ విచారణకు సిద్ధమని ప్రకటించారు. న్యాయస్థానం ఆదేశాలతో సీబీఐ దర్యాప్తు జరిపి 403 పేజీల చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించింది.

ముగిసిన ఎఫ్‌ఆర్‌ఓల శిక్షణ



శిక్షణ ఎఫ్‌ఆర్‌ఓలతో డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి

మన్ననూర్: దూలపల్లి అకాడమీ నుంచి వచ్చిన మహారాష్ట్రకు చెందిన 35 మంది అటవీ సంరక్షణ అధికారులు (ఎఫ్‌ఆర్‌ఓ) నల్లమలో శిక్షణ ముగించుకున్నారు. అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన మన్ననూర్, అమ్రాబాద్, మద్దిమడుగు, దోమలపెంట రేంజ్ అటవీ పరిసర ప్రాంతాలైన గుండం, భౌరాపూర్, ప్రతాపరుద్రుని కోట తదితర ఎత్తైన కొండలు, జలపాతాలు, పులులు సంచరించే ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌తో పాటు వివిధ రకాల శిక్షణ పొందారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా పులుల ఘణన, గడ్డి క్షేత్రాల పెంపు, ఫైర్‌లైన్, శాఖాహార జంతువుల కదలికలు, టైగర్ ఫేస్ మానిటరింగ్ విధానాలు వివరించారు. ప్రమాదకర ప్లాస్టిక్ నిషేధం, అటవీ పరిసర ప్రాంతాల్లో అనుసరించాల్సిన విధానాలు, చట్టాల గురించి తెలుసుకున్నారు. అలాగే అటవీ ప్రాంతంలో ఉన్న శివాలయాలను కూడా సందర్శించారు. ఆరురోజుల పాటు శిక్షణ కొనసాగనా.. చివరిరోజు ఆదివారం మన్ననూర్ వన మాళికా ప్రాంగణంలో ఎఫ్‌డీ క్షితిజ, డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డి, ఎఫ్‌డీఓ విశాల్, ఎఫ్‌ఆర్‌ఓ రవికుమార్, బయోలజిస్టు మహేందర్, ముజీబ్ సమక్షంలో నేర్చుకున్న అంశాలపై సమీక్షించి వెళ్లారు.

పాలకమండలికి నోటిఫికేషన్

- ఉమ్మడి జిల్లాలో పది ఆలయాలకు జారీ
- త్వరలో మరికొన్ని ఆలయాలకు..



పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయం

జోగుళాంబ శక్తిపీఠం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దేవదాయశాఖ పరిధిలోని పలు ఆలయాలకు పాలక మండలిలు (ట్రస్టు బోర్డు) ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు దేవదాయశాఖ మొదటి విడతలో పది ఆలయాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో వంశపారంపర్యం కలిగిన ఆలయాలకు కూడా ట్రస్టు బోర్డు సభ్యులను నియమించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం, జడ్చర్ల వేంకటేశ్వర, దేవరకద్రలోని వీరప్పయ్య స్వామి, వెల్దండ మండలం గుండాలలోని అంబారామలింగేశ్వర, ధరూర్ మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి, కేటీదొడ్డి మండలంలోని పాగుంట వెంకటాపూర్ వేంకటేశ్వర, కృష్ణా మండలం గూడెబల్లూరు లక్ష్మీవేంకటేశ్వర, ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నె వేంకటేశ్వర స్వామి, ఉప్పునుంతల మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ స్వామి, గోపాలపేట మండలం బుద్దారం గండి ఆంజనేయ స్వామి ఆలయాలకు పాలక మండలి సభ్యుల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు నోటిఫికేషన్ విడుదలైనట్లు దేవదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ తెలిపారు.

హిందువులకు మాత్రమే..

సభ్యులుగా దరఖాస్తు చేసుకునే వారు ఖచ్చితంగా హిందూమతానికి చెందిన వారే అయి ఉండాలని దేవాదాయశాఖ సూచించింది. పోలీసు కేసులు ఏదేనీ ఉన్నా, లేదా ఆలయ భూములు గుత్తకు తీసుకున్నా, ఆలయాల్లో గుత్తేదారులుగా ఉన్నా, ఆలయాల్లో పని చేసే వారి బంధువులు ఎవరైనా ఉన్నా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నా ఇందుకు అనర్హులని పేర్కొన్నారు.

ఫైరవీల జోరు

నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయ నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. సంబంధిత ఎమ్మెల్యేలు, అధికార పార్టీ పెద్దలను వశం చేసుకుని తమను ట్రస్టు బోర్డు సభ్యులు, చైర్మన్‌లుగా నియమించాలని ప్రదక్షిణ మొదలు పెట్టారు. ఇదిలా ఉండగా మలి విడతలో మరికొన్ని ఆలయాలకు కూడా నోటిఫికేష్ జారీ కానుంది.

అందించాల్సిన వివరాలు

నమోదు చేసుకోవడానికి దేవాదాయశాఖ వారు ఇచ్చే ఫాం–2ను పూరించాల్సి ఉంటుంది. ఇది ఆయా ఆలయాల్లో లభిస్తుంది. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, (ఎస్సీ, ఎస్టీ, బీసీ), నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, 30ఏళ్ల వయసు పై కలిగిన వారై ఉండాలి. నోటిఫికేషన్ వెలువడిన 20 రోజులలో మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుపై నోటరి, గెజిటెడ్ అధికారి సంతకం ఉండాలి. పూర్తి చేసిన దరఖాస్తులు ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మహబూబ్‌నగర్ దేవదాయ శాఖ, ఏసీ కార్యాలయంలో అందజేయాలి. 6(ఏ) క్యాడర్ దేవాలయాల్లో 14 మంది, 6(బీ) క్యాడర్ దేవస్థానంలో ఏడుగురు ధర్మకర్తలు, 6(సీ) క్యాడర్ దేవస్థానంలో ఐదుగురు ధర్మకర్తలు ఉండాలి. చైర్మన్‌గా వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఉన్న ఆలయంలో అయినా ఇందులో ఎస్సీ లేదా, ఎస్టీ, అలాగే ఒక బీసీ మరొక మహిళ ఖచ్చితంగా ఉండాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

పదేళ్లలో జరగని అభివృద్ధి ఏడాదిలో చేస్తాం

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి



ధన్వాడలో మాట్లాడుతున్న వంశీచందర్‌రెడ్డి.. చిత్రంలో నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

ధన్వాడ: బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వాలు పదేళ్లలో చేయని అభివృద్ధిని ఒక్క సంవత్సరంలో చేసి చూపిస్తామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గున్ముక్ల కడపరాయుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి న్యాయ యాత్రను ప్రారంభించారు. గున్ముక్ల, ఎమ్మోనిపల్లి, కంసాన్‌పల్లి మీదుగా ధన్వాడకు చేరుకుంది. వీధుల్లో పర్యటించి బస్టాండ్ ఎదుట ఉన్న చిట్టెం నర్సిరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన పర్ణికారెడ్డి జీఓ నంబర్ 69 అమలుచేసి మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని సుమారు లక్ష ఎకరాలకు సాగు, తాగు నీరు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరగా.. దీనికి ఆయన వెంటనే స్పందించి అమలు చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. సాగు నీరందక నియోజకవర్గ రైతులు ఇబ్బందులు పడుతున్నారని.. పెద్ద చెరువులో నీరు లేక ముదిరాజ్‌లు ఉపాధి కోల్పోతున్నారని ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వివరించారు. గత ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం, 132 కేవీ సబ్‌స్టేషన్, 30 పడకల ఆస్పత్రి, టెక్స్‌టైల్స్ పార్క్, కాటన్ మార్కెట్ ఏర్పాటు చేయలేదని.. ఇవన్నీ అందుబాటులోకి తెచ్చి ఉంటే న్యాయయాత్ర చేసేవాడిని కాదని వివరించారు.

ధన్వాడ పెద్దచెరువుకు పూర్వ వైభవం..

ధన్వాడ ప్రజల ఏళ్ల కల పెద్ద చెరువును నీటితో నింపేందుకు ముఖ్యమంత్రితో చర్చించానని.. త్వరలోనే పూడిక తొలగించి పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. అలాగే రహదారి విస్తరణ చేపట్టి డివైడర్లు, వీధిదీపాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నరహరి, సింగిల్‌విండో అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా జట్ల ప్రతిభ

- బాలికల జట్టు విజేత, బాలుర జట్టుకు మూడోస్థానం



మూడోస్థానంలో నిలిచిన బాలుర జట్టు



బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

మహబూబ్‌నగర్ క్రీడలు: యాదాద్రి భువనగిరిలో ఆదివారం ముగిసిన 6వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా జట్లు మెరుగైన ప్రతిభకనబరిచాయి. టోర్నీలో బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో జిల్లా బాలికల జట్టు 10– 0 పాయింట్ల తేడాతో సంగారెడ్డి జట్టుపై గెలుపొందింది. అదేవిధంగా బాలుర జట్టు మూడోస్థానాన్ని దక్కించుకుంది. జిల్లా జట్లకు ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ట్రోఫీలు అందజేశారు. ప్రతిభచాటిన జిల్లా జట్లను జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, కోచ్‌లు నర్సింహులు, సత్యం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

అర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా డా. తిమ్మారెడ్డి



సదస్సులో డా. తిమ్మారెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

గద్వాల అర్బన్: ఆర్థోపెడిక్ సర్జన్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన డా. తిమ్మారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం కరీంనగర్‌లో జరిగిన తొమ్మిదో ఆర్థోపెడిక్ సర్జన్స్ సదస్సులో ఈయనను ఎన్నుకున్నారు. డా. తిమ్మారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రాక్టిసింగ్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి, ప్రభుత్వ ఎంఏఎల్‌డీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివారు. ఎంసెట్‌లో ర్యాంకు సాధించి వైద్యవిద్య పూర్తి చేశారు. ప్రస్తుతం ఉస్మానియా మెడికల్ కళాశాల, జనరల్ ఆస్పత్రిలో ప్రొఫెసర్, ఆర్థోపెడిక్ విభాగం అధిపతిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అదేవిధంగా అనేక రాష్ట్ర, జాతీయస్థాయి సెమినార్‌లలో డా. తిమ్మారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సంద ర్భంగా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలను మోసం చేసేలా కేంద్ర బడ్జెట్

- టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పూర్తిగా ప్రజలను మోసం చేసేలా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో 13 శాతం ఆర్థికపరమైన అభివృద్ధి పెరిగితే 42 శాతానికి వ్యయానికి తగ్గిందన్నారు. పెరిగిన ఆదాయం కార్పొరేట్లకు వెళ్లిందని, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని ఆరోపించారు. అప్పర్‌భద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఈ బడ్జెట్‌లో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ప్రస్తావన లేకపోవడం సరికాదన్నారు. బీజేపీ జిల్లా నాయకులు దీనిపై ప్రజలకు ఏం సమాధానం చెబుతారని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు నిధులు తక్కువ చేశారని అన్నారు. 2018–22 వరకు నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో వ్యవసాయ రంగానికి కేటాయించిన నిధులు రూ.1,05,314 కోట్లను ఖర్చు పెట్టకుండా సరేండర్ చేసిన అసమర్థ ప్రభుత్వమని ఆరోపించారు. రైతులను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు. రైతులకు వాడుకునే వ్యవసాయ పరికరాల కొనుగోలుపై 18 శాతం జీఎస్టీ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇన్‌కం టాక్స్ పెంచుతామని చెప్పి బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన చేయలేదన్నారు. సమావేశంలో జిల్లా మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.